# జానపద కళారూపాల పరిణామ విధానం

జానపద కళారూపాల క్రమపరిణామాన్ని గురించిన మౌలికమైన పరిశోధన మనదేశంలో ఇంకా పరిపూర్ణంగా జరగలేదనే చెప్పవచ్చు. ఆదిమజాతి మానవుడు ఆనందంతో వేసిన మొదటి చిందే నృత్యానికి నాంది అనీ, ఇతర జంతువులను అనుకరిస్తూ అతడు వేసిన మొదటి కూతే తొలి భాషణం అనీ, వాటిని తాను అనుకరిస్తూ ఇతరులకు తెలియచెప్పడమే తొలి రూపకదశ అనీ దాదాపు అందరు పరిశోధకులు అంగీకరిస్తున్నారు. శ్రమనుంచీ, అవసరం నుంచీ మనిషి ప్రాథమిక కళారూపాలు ఆవిర్భవించాయని, అందువల్ల మూగమానవుని మౌన సంకేతాలలోనే అభినయం ప్రారంభమైనదనీ వీరి అభిప్రాయం. అంటే - మనిషి తాను బ్రతకడానికి చేసే ప్రయత్నంలోను, ప్రకృతిని, పరిసరాలను అర్థం చేసుకోవడంలోను, ఆ సరికొత్త అనుభవాలను తనతోటివారితో పంచుకొనే ప్రయత్నంలోనూ ఆవిర్భవించినవే ఆట-పాట-మాట అన్నమాట. వీనితోపాటు ఎండిన జంతుచర్మాలు చేసే ధ్వనులకు ఆకారాలను కల్పించి చర్మవాద్యాలను, ప్రకృతినుంచి గ్రహించిన వాయువాద్యాలను, ఆటపాటలకు అనువుగా వాయించడం నేర్చుకున్నాడు. ఈ వాద్యాలు అతని ఆటపాటలకు కావలసిన ఊపును, లయను ఇచ్చివుంటాయని ఊహించవచ్చు.

మానవుడు ఈ తొలి ఆహార సేకరణ దశనుదాటి ఒకచోట స్థిరనివాసం ఏర్పరచుకొని తన ఆహార ధాన్యాలను తానే పండించుకోవడం మొదలుపెట్టిన రెండవ దశలో తనకు, తన గ్రామానికి అవసరమైన వస్తు సంభారాలను ఉత్పత్తి చేసుకోవడం ప్రారంభించాడు. ఈ ఉత్పాదక దశలో కూడా వెనుకటి భయాలను పూర్తిగా త్యజించలేకపోవడంతో బయటినుంచి వచ్చే ప్రమాదాలను పరిరక్షించుకోవడానికి తనకు ప్రకృతికి ఇప్పుడు ఏర్పడుతున్న సరికొత్త సంబంధాలను నిర్దేశించుకొనే ప్రయత్నాలలోను ఆనాటికి తనకు అర్థంకాని విషయాలను అతిమానవీయ, దైవిక శక్తులుగా ఊహించాడు. ఆ శక్తుల ఉపశమనానికి, తన సీమను ఊరి బయటినుంచి వచ్చే శక్తులనుంచి రక్షించుకోవడానికి ఊరి ఎల్లల్లో దేవతలను ప్రతిష్ఠించుకున్నాడు. మాతృస్వామ్య వ్యవస్థ కనుక అధిదేవతగా స్త్రీమూర్తిని, తదితర కార్యాలకు మగదేవతలను సృష్టించుకున్నాడు. ఆ దేవతల ప్రీతికోసం, తాను కోరుకున్న పనుల విజయం కోసం పూజలు, పునస్కారాలు మొదలుపెట్టాడు. తనకు తెలిసిన నైవేద్యం ఒక జంతువు కనుక జంతుబలులు అందులో భాగమైపోయాయి. ఆహారసేకరణ దశలో ప్రకృతిలోని అందాలను ప్రతీకలుగా నిర్మించుకొని ఆనందించినవాడు ఇప్పుడు ఆ ప్రతీకలకు ఆకృతిని ఇచ్చి పూజించడం మొదలుపెట్టాడు. ఈ పూజా పునస్కారాలు ఆహార ఉత్పత్తి దశలో రావడానికి ముఖ్యకారణం - మానవుడు తన సాంఘిక జీవన పద్ధతుల్లో నిర్మించుకుంటున్న వ్యవస్థాగత విధానాన్ని తనకు అంతుచిక్కని ప్రకృతి రహస్యాలకు మారుపేరుగా నిలిచిన దేవతామూర్తులకు కూడా వర్తింపచేయడమే! గ్రామ నిర్మాణాలు జరిగాక గ్రామీణుల్లో రెండు తెగలు ఏర్పడ్డాయి: రక్షించేవాళ్ళు, రక్షింపబడే వాళ్ళు. రక్షించేవాళ్ళల్లో రాజును ప్రత్యక్షదైవంగాను, ఆ రాజును తమను కూడా రక్షించగలరని విశ్వసించిన దేవతల ప్రతినిధులయిన పూజారులను పరోక్ష దైవాలుగాను స్థిరీకరించి

...లమ్మలు, పోలేరమ్మలు వెలిశారు. ఇదేకాలంలో ఊరికి అవసరమయిన ...ఆ వృత్తుల, వృత్తికారుల సంక్షేమాన్ని అనుగ్రహించే

అధిష్ఠాన దేవతలు వెలిశారు. వృత్తుల అధిదేవతలను ఆయా వృత్తుల వారే కొలిచేవారు. ఊరి అమ్మవారి కొలుపుల్లో మాత్రం అందరికీ ప్రత్యక్ష సంబంధం ఉండేది. అమ్మవారి కొలుపుల్లో ఆయా వృత్తులవారు చేసే పనులకు అనుగుణంగా పనులు కేటాయించబడ్డాయి. రానురాను వృత్తులనుంచి కులాల బదలాయింపు జరిగిన కాలంలో కొన్నిచోట్ల వృత్తుల గణదేవతలే కులదేవతలు కూడా అయినారు. మరికొన్ని సందర్భాల్లో అటు వృత్తుల దేవతలకు, ఇటు కులదేవతలకు కూడా పూజలు జరపడం ఆనవాయితీ అయింది.

వీటికితోడు ఆయా ఊళ్లలో మానవత్వపు విలువలకు ప్రతీకలుగా నిలిచిపోయే ప్రధాన సంఘటనల జ్ఞాపకార్థం - ముఖ్యంగా పేరంటాళ్లయిన స్త్రీలకు - కొలుపులు చెయ్యడం మొదలైంది. వీనితోపాటు ఏదోవిధంగా శక్తిసామర్థ్యాలు చూపి ప్రాణాలు కోల్పోయిన వీరులకు కూడా కొలుపులు జరపడం మొదలుపెట్టారు. వీరిని కూడా దేవతాగణంగా కొలవడం, వీళ్లకు రానురాను ప్రతీకలు నిలపడం మొదలుపెట్టాక వీరి దేవత్వానికి సంఘం ఆమోదముద్ర వేసినట్లయింది.

అంటే - జనపదాలు స్థిరం అవుతున్న ఈ దశలో ఐదురకాల కొలుపులు - ఆయా ప్రదేశాలను బట్టి ఉండేవని తెలుస్తున్నది.

1. **గ్రామ దేవతలు :** ఊళ్లో అన్ని వృత్తులవాళ్లు, రానురాను అన్ని కులాలవారు ఈ కొలుపుల్లో పాల్గొనేవాళ్లు; సామూహికంగా పాల్గొని ఆనందించే వాళ్లు కనుక వీటిని 'సంబరాలు' అనడం కద్దు.

2. **వృత్తుల అధిదేవతలు :** ఒక్కొక్క వృత్తివారికి ఒక్కొక్క అధిష్ఠాన దేవత ఉంటుంది. ఆ దేవత/దేవుడి పూజలు ఆ వృత్తివారికే పరిమితం. ఈ పూజల్లో సంబరం కన్న భక్తి ఎక్కువ.

3. **కుల దేవతలు :** వృత్తులకు వంశపారంపర్యంగా హక్కు భుక్తాలు ఏర్పడినప్పుడే కులాలు పుట్టుకువచ్చాయి. ఈ బదలాయింపుకు ముఖ్యమైన కారణం అధికారంలో ఉన్న కులాలవాళ్లు తమ వృత్తివల్ల వచ్చే లాభాలను ఇతరుల హక్కుభుక్తం కానివ్వకుండా స్వంతంగా తమ కుటుంబాలలోనే ఉంచుకోవాలనే తాపత్రయం.

అయితే, ఈ బదలాయింపులో పరోక్షంగా కులదేవతలు, వీరుల పాత్రను కూడా గమనించవచ్చు. సామాజికంగా చూస్తే వృత్తులన్నీ చేస్తున్న పనిపాటలకు సంబంధించినవి. కులాలు సమాజపరమైనవి. అందువల్ల మతపరమైన కర్మకాండ జరపటం కులానికంతా విస్తృతమైంది కనుక ఆ కర్మకాండ జరిపే కుల పెద్దల అధికారం పెరిగింది. 'వీరుల' కులానికి ప్రత్యేకమైన ప్రాముఖ్యం ఉంది కనుక ఆ అధికారం స్థిరీకరించబడ్డది. ఒకవిధంగా చూస్తే కులాలను నియతంగా ఉంచడానికి, వారి సామాజిక ఐకమత్యానికి కులదేవతల కొలుపులు ముఖ్య కార్యక్షేత్రాలయినాయని చెప్పవచ్చు.


కులదేవతల కొలుపులకన్న వీరుల కొలుపులు చారిత్రకంగా ప్రజల హృదయాలకు సన్నిహితమైనవి. అందువల్ల వారిని గురించి ఆడి, పాడి వారి సంస్మరణార్థం కొలుపులు చేస్తే, ఆ వీరుల కులాల వారిని ఒకచోటికి చేర్చడానికి అవి వేదికలయ్యాయి. కులదేవతలను గురించిన ఆటపాటలు అందుకు భూమికను సమకూర్చాయి. అయితే వీరుల కొలుపులు ఆ కులానికి మాత్రమే పరిమితం కాకపోవడంతో ఇతర కులాలవారి ప్రమేయం కూడా ఉండడం అక్కడక్కడా గమనించవచ్చు.


4. **పేరంటాళ్లు :** ఒక నిర్దిష్టమైన ఆదర్శంకోసం ప్రాణాలర్పించిన స్త్రీలు పేరంటాళ్లు. పెళ్లిళ్లు అయికూడా బ్రహ్మచారిణులు. సంఘం కట్టుబాట్లకు, కుల ఔన్నత్యానికి, నైతిక విలువలకు ప్రాముఖ్యాన్నిచ్చి ఆత్మత్యాగానికి పాల్పడిన వాళ్లు. మొదట మొదట ఆకులం వారే కొలుపులు జరిపినా, ఆ నైతిక విలువను సంఘం ఆమోదించినప్పుడు అన్నికులాల వారు, ముఖ్యంగా అంతకన్న సాంఘికంగా తక్కువ కులాలవాళ్లు ఆ కొలుపుల్లో పాల్గొనడం సాధారణం అయింది.

5. **వీరులు :** వీరుకూడా ఒక ఆదర్శం కోసం ప్రాణాలర్పించిన వాళ్లే! అయితే వీరిలో కేవలం కులాల ఉన్నతికోసమే ఆత్మత్యాగం చేసినవారు బహు కొద్దిమంది. తరుచు తనుతను రాజుల గౌరవంకోసం పోరాడి, యుద్ధంలో అసువులు బాసినవారు. లేదా, అన్యాయాలకు ఎదురొడ్డి వీరోచితమైన మరణం పొందినవారు.

అందువల్లనే ఈ వీరులను అతని కులం వారికన్న అతని జన్మభూమిలోని ప్రజలు ఎక్కువగా కొలవడం సర్వసాధారణంగా కనిపిస్తుంది. అందువల్ల - స్థూలంగా - స్త్రీల వీరగాథలను (పేరంటాళ్ల గాథలను) కులగాథలుగాను, వీరుల గాథలను స్థలగాథలుగాను పేర్కొనవచ్చు. ఇందుకు విపర్యయం కూడా కొన్నిచోట్ల కనిపిస్తుంది. అందువల్లనే ఇది స్థూలమైన విభజన మాత్రమే.


ఈ అయిదు రకాల కొలుపుల్లో మొదటి, రెండవ పద్ధతులు తొలిదశలో ప్రారంభం అయ్యాయి. అంటే, వృత్తులు మాత్రమే ఉన్నరోజుల్లో - అప్పుడు అమ్మవారి (గ్రామదేవత) కొలుపులు, వృత్తిదేవత కొలుపులు మాత్రమే ఉండేవి. గ్రామదేవత కొలుపుల్లో ఊరివారందరూ, అన్నివృత్తులవారూ పాల్గొనేవారు. వృత్తుల దేవతల పండగల్లో ఆయా వృత్తుల వారు పాల్గొనేవారు. దీన్ని రేఖాచిత్రంగా చూద్దాం:





ఈ రెండు రకాల పండగల్లో మొదటిది గ్రామదేవత కొలుపులు. ఊరంతా పాల్గొనేవారు. ఈరేఖాచిత్రంలోని వృత్తాకారం దీనిని సూచిస్తుంది. ఒక వృత్తి దేవత కొలుపులకీ, మరొకవృత్తి దేవత కొలుపులకీ సంఘర్షణ లేకుండా ప్రక్క-ప్రక్కనే జరిగేవి కనుక లోపలవున్న ఖండిత వృత్తాలు వానిని సూచిస్తాయి. ఈవిధంగా వేరువేరుగా జరిగే కొలుపులు మరొకవృత్తి వారికి సంబంధం లేనివిగా విడివిడిగా జరిగేవి కనుక ఈరకం కొలుపుల్ని అవ్యవహిత రూపాలు (Contiguous forms) అనవచ్చు. ఈ అవ్యవహిత రూపాల నమూనాలో బయటి వృత్తం గ్రామ దేవత కొలుపుల్ని, అందులో ఒకదాని ప్రక్కనే మరొకటిగా చూపబడ్డవి వృత్తిదేవతా గణాల పూజల్ని సూచిస్తాయి.

ఇక వృత్తులు కులాలుగా రూపాంతరం చెందిన తరువాత మొత్తం గ్రామం అంతా గ్రామదేవత కొలుపులు చేసేవారు. వీరుల, పేరంటాళ్ళ కొలుపుల్ని కొన్ని కులాలవారు మాత్రమే చేసేవారు. కులదేవతల కొలుపుల్ని ఆ కులం వాళ్లే చేసేవాళ్లు. వృత్తుల దేవతల కొలుపులు, కులాల దేవతల కొలుపులు చేయడంతో కొందరు రెండింటిలోను పాల్గొనేవారు; మరికొందరు పాల్గొనేవారు కాదు. అందువల్ల రేఖాచిత్రంలో చూపినట్లు ఖండితరేఖలు ఇదివరకు ఉన్న అవ్యవహిత పద్ధతిలో కాక, ఒకదాని పొలిమేరలను వేరొకటి ఖండిస్తూ వ్యాపిస్తాయి. అందువల్ల వీనిని సంకీర్ణ రూపాలు **(intersecting forms)** అనవచ్చు.




ఈ చిత్రంలో వృత్తపరిధి గ్రామాన్ని సూచిస్తుంది. లోపలి రేఖా ఖండికలను తీసివేస్తే అది గ్రామమంతా ఆచరించే పండగలకు ప్రతీక. ఖండితంగా ఉన్న భాగాలు కులదేవతల, వృత్తి దేవతల కొలుపులు.

జానపదుల భావన విచిత్రమైనది. అతిమానవీయ శక్తులున్నట్లు తాము భావించిన దేవతాగణాలకు తోడుగా మానవగణాలు సృష్టించుకొన్నారు. వారికి అతిమానవీయ గుణాలను ఆపాదించారు. వారిని అతిరూపులుగా, ఉత్తమ లక్షణోపేతులుగా చిత్రించుకున్నారు. తమ మధ్యనేపుట్టి వీరకార్యాలు సాధించిన స్త్రీ, పురుషులకు దేవత్వాన్ని ఆపాదించుకొని పూజలు, పునస్కారాలు, కొలుపులు చేయడం మొదలుపెట్టారు. వారి అతిమానవీయతను సమర్థవంతంగా చూపించడానికి వారిచుట్టూ చిత్రవిచిత్రమైన కథలను అల్లారు. ప్రతి కులంవారూ తమకులదేవత, తమ కులవీరుల అతి మానవీయతను చూపించడానికి కులపురాణాలను వెలయించుకున్నారు. ఆ కథలను ప్రచారం చేయడానికి సమిష్టి బాధ్యతమీద కథాకారులను ఒక ప్రత్యేకవర్గంగా సృష్టించి, వారికి పూజారులకు ఉండే విలువను, గౌరవాన్ని, బాధ్యతను అప్పచెప్పారు. ఆవిధంగా బయలుదేరినవే జానపద కథాగాన రూపాల తొలి పాత్యాలు.

క్రీస్తుకు పూర్వం అయిదు - ఆరు శతాబ్దాల నాటికే జనపదాలు మొదలుకొని రాజ్యాల వరకు - పాలకులు, పాలితులు అన్న వర్గసంప్రదాయం స్థిరపడిపోయింది. దీనికి చారిత్రక కారణాలు ప్రధానం. ఒక రాజ్యాన్ని మరొకరాజు దండెత్తి జయిస్తే పాలకుడయిన రాజు మతాన్ని, ఆచార వ్యవహారాన్ని పాలితులయిన రాజులు, రాజకుటుంబీకులు అనుసరిస్తారు. అది సామాన్యుణ్ణి కదిలించి, అతడిలో కూడా మార్పు రావడానికి ఎన్నో సంవత్సరాలు పడుతుంది. ఈ కారణం వల్లనే వారు తమ పాత పద్ధతులని లోలోపల ఆచరిస్తూ, అవసరమైతే పాలకుల ఆచారాన్ని బాహ్యంగా అంగీకరిస్తారు. పాలకులు పురాణ సంప్రదాయాన్ని అనుసరిస్తే, పాలితులు,

సామాన్యులు భక్తి సంప్రదాయాన్ని అనాదిగా అనుసరిస్తూ వస్తూనే ఉన్నారు. సమాజంలోని పై వర్గం వారు పాలకుల సంప్రదాయాన్ని అనుసరించారు. సామాన్య ప్రజలు, దిగువ వర్గాల వారు - పాలకుల సంప్రదాయానికి తల ఒగ్గినా - తమ భక్తి సంప్రదాయాన్ని ఒదులుకోలేదు.

సామాన్యుల భక్తి సంప్రదాయానికీ, పాలకుల పురాణ సంప్రదాయానికీ మౌలికంగా భక్తి, భయం, మానసికమైన క్రమశిక్షణ వంటివే ప్రాతిపదికలయినా ఆచారణలో మాత్రం ఆ రెండింటిలోనూ ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. పురాణ సంప్రదాయంలో భారతీయ ఇతిహాస, పురాణాల నాయకులు దేవతలు. గ్రామగ్రామాన వారిపేర దేవాలయాలు వెలిశాయి. ఇందులో శైవ, వైష్ణవ సంప్రదాయాల వారు ఒకరికొకరు తీసిపోకుండా పోటీపడ్డారు. దైనందిన పూజాకార్యక్రమాలకు ప్రాధాన్యం హెచ్చింది. అయా దేవతలకు ఇష్టమైన తిథులలో ప్రత్యేకమైన పూజా కార్యక్రమాలు నిర్వహించినా, ప్రతిరోజూ జరిగే పూజలున్నాయి. నిత్యకైంకర్యం మొదలైంది. దానికిగాను పూజారులు, దాతలు, పూజా విధానాలు స్థిరపడ్డాయి. ఈ పూజా విధానంలో కొంత కర్మకాండ (ritual) ఉన్నా, దానికి అనుసంధానించి ఉండే మంత్రతంత్రాల, పూజా కార్యక్రమాల విధివిధానం ముఖ్యమైంది. పూజావిధానంలో క్షాత్రియత్రికానికి (నృత్యం, గీతం, వాద్యం) ప్రాముఖ్యం వచ్చింది. అయితే ఇది ఆనుషంగిక సేవ మాత్రమే. అసలు సేవ పూజా విధానమే.

ఈ పద్ధతులకు విరుద్ధంగా జానపదుల దేవతల కొలుపుల్లో కర్మకాండకే ప్రాముఖ్యం. వారికి మంత్రాంలో అంతగా నిమిత్తం లేదు. నిత్యజీవిత విధానంలో అనుసరణీయమైన అన్ని కార్యక్రమాలకు ప్రత్యేకతను రూపొందించి ఈ కర్మకాండలో భాగంగా నిలిపారు జానపదులు. ఉదాహరణకు ముగ్గు వేయడం (స్థలాన్ని శుభ్రపరచడం), పటం కట్టడం (ఆవాహనకు సిద్ధం చేయడం), వేటను కొయ్యడం (నైవేద్యాన్ని సిద్ధం చేయడం) - ఇటువంటివి ముఖ్యమైనాయి. ఇందులో సర్వులూ పాల్గొనే 'ఆట' ముఖ్యం. దానిని అనుసంధానించి ఉండే వాద్యఘోష ముఖ్యం. దానితోపాటు సాగే స్తుతి పాఠాలు ముఖ్యం..... ఇక్కడ నిత్య ధూప, దీప, నైవేద్యాల ప్రసక్తి లేదు. ఇవి అన్నీ సంవత్సరానికి ఒక్కసారి జరిగే వార్షిక ఉత్సవాలు. గుళ్ళూ, గోపురాల ప్రసక్తి ఉండేది కాదు మొదటిరోజుల్లో. ఉన్నా - ఒక పూరిగుడిసె లేదా ఒక వేపచెట్టు కింద, లేక ఒక రావిచెట్టు కింద ఎత్తయిన వేదిక. దేవతాగణం రూపురేఖలు ఉన్న మూర్తులయితే ఆ గుడిలోనో, లేదా పూజారి ఇంట్లోనో కొలుపుల తరువాత భద్రపరిచేవారు. ఒకవేళ పూజలు చేసేది ఏ వీరులకో, పేరంటాళ్లకో అయితే ఆ దేవతామూర్తుల్ని వారి వారి వంశాల మూల కుటుంబాల్లోనో, వంశపారంపర్యంగా వస్తున్న పూజారుల ఇళ్లల్లోనో ఉంచడం జరుగుతుంది. ఆ దేవతాగణం చాలవరకు జానపదులు ఊహించిన ఆకృతులకు ప్రతీకలు మాత్రమే!

ఈ పురాణ, భక్తి సంప్రదాయాలను పాశ్చాత్య జానపద విజ్ఞాన విమర్శకులు Great Tradition and Little Tradtion అన్నపేర్లతో వ్యవహరించడం కద్దు. ఇటువంటి మూల్యాలను గురించిన నిర్ణయం (Value judgement) భారతీయ స్థితిగతులకు, సంప్రదాయాలకు ఒదగనిది. ఒకవేళ ఆ పేర్లతో పిలవవలసి వస్తే జానపద భక్తి సంప్రదాయాన్నే Great Tradition అనవలసి వుంటుంది - దానిని అనుసరించే అసంఖ్యాక ప్రజానీకం దృష్ట్యా చూసినా, అది పాదుకొనిపోయివున్న కాలనిర్ణయం దృష్ట్యా చూసినా. ఇందులో ఒకటి గొప్ప, రెండవది చిన్న అన్న మీమాంస కన్న ఆ సంప్రదాయాల్లో ఉన్న ప్రధానమైన సామ్య, తారతమ్యాలను గుర్తించడం ప్రయోజనకారి.

క్రీస్తుశకం రెండవ శతాబ్దానికి అటు భక్తిసంప్రదాయమూ (అనూచానంగా వస్తున్న సంప్రదాయం), ఇటు పురాణ సంప్రదాయం (కొత్తగా రూపుదిద్దుకున్న సంప్రదాయం) - రూఢి అయి గ్రామాల్లో నిలిచిపోయాయని చెప్పవచ్చు. స్థూలంగా ఊరిలో ఉన్న పై కులాలవాళ్లు పురాణ సంప్రదాయాన్ని, సామాన్యులు భక్తి సంప్రదాయాన్ని అనుసరిస్తూ ఉండేవారు. దాదాపు అందరూ సాంప్రదాయిక భజన కార్యక్రమాల్లో పాల్గొన్నా, వారి మొగ్గు మాత్రం వారికి వారికి తగిన పద్ధతిలో స్థిరం అయింది. ఈ దశలోనే ఈ రెండు సంప్రదాయాలు తమ పూజావిధానంలోను, కర్మకాండ విధానంలోను, వానిలో వాద్య, గీత, నృత్యాలను వాడడంలోను పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం కూడా జరిగింది. పాలకులు తమ సంప్రదాయాన్ని సామాన్యులు కూడా అనుసరిస్తే తప్ప తమకు మనగుడలేదని గుర్తించడం, సామాన్యులు కూడా అధికారంలో ఉన్నవారి సంప్రదాయం వైపుకు మొగ్గడం ప్రపంచంలో అన్ని దేశాలలోను కనిపిస్తుంది.

పురాణ సంప్రదాయాన్ని ప్రజలకు దగ్గరగా తీసుకొని పోవడానికి ఉపయోగపడ్డ మొట్టమొదటి కళారూపాలు భజన, కీర్తన. భగవన్నామాన్ని భజిస్తూ, ఆయనకు చేసే స్తోత్రపాఠాలు భజనలు. నిజానికి ఇవి అష్టోత్తరాలకి, సహస్రనామార్చనలకి ప్రాదేశిక రూపాలు. ఇది సామూహిక గాన రూపం. భగవంతుడు మానవాళిని రక్షించడానికి చేసిన అశేషమైన అతిమానసీయ కార్యాలను గురించి కథలుగా క్లుప్తంగా తెలియచెప్పేవి కీర్తనలు. తరువాతి కథాగాన రూపాలకు ఇవి ప్రాతిపదికలనుకోవచ్చు. ఇవి తొలుత - ఒక పూజావిధికి, మరొక పూజావిధికి మధ్యకాలంలో భక్తులను భగవధ్యానం వైపుకు దృష్టిని కేంద్రీకరించేటట్లు చేయడానికి ఉద్దేశించినవి. అయితే, రాను రాను భక్తిభావాన్ని వెలువరిస్తూనే మానవుని సృజనాత్మక శక్తిని చాటిచెప్పుకోవడానికి వీలయిన కళారూపాలయినాయి. సామూహికమైన భజననుంచి, సామూహికమైన బృందగాన నేపథ్యంలో, ఒక వ్యక్తి నేతృత్వంలో సాగే కీర్తన రూపానికి ఎదగడంలో వ్యక్తి నిష్ఠమైన ప్రావీణ్యం, సాధన వ్యక్తం అవుతున్నాయి. అంటే సామూహిక రూపాల నుంచి వైయక్తిక రూపాలకు జరిగే మార్పు వ్యక్తం అవుతున్నది. ఈకీర్తనకారులు కళాకారులై, పలు గ్రామాల కోరికమేరకు సంబరాలు సలిపి, అక్కడి కళాకారులకు కూడా శిక్షణను ఇవ్వడం ప్రారంభించడంతో కళ విద్యగా స్థిరపడిపోయింది. ఆ కాలంలోనే సామూహిక రూపాలు వైయక్తిక శాస్త్రీయ రూపాల వైపుకు పయనించే ప్రథమదశ ప్రారంభమైనదన్నమాట.

పురాణ సంప్రదాయం జానపదలు ఆటపాటలకు ఏవిధంగా స్వంతం చేసుకున్నదో గమనించాలంటే ఈ సామూహిక దేవాలయ రూపాలు కళారూపాలుగా ఏ పరిణామ క్రమంలో వికసించాయో తెలుసుకోవలసి వుంటుంది. ఈ మార్పు ఏ ఒక్కరోజులోనే జరగడానికి వీలులేదు. దానికి కొన్ని వందల సంవత్సరాలు పట్టివుండవచ్చు. ఈ పరిణామం ఏవిధంగా జరిగిందో ఊహించడానికి, ఆ పరిణామ క్రమంలో పురాణ, భక్తి సంప్రదాయాల సమ్మేళనం ఎలా జరిగిందో సూచించడానికి ఈనాటికీ ప్రచారంలో ఉన్న దేవాలయ సంప్రదాయాలను కొలుపుల్లోని ఆచారాలను, అవి ప్రతిబింబించే సాంఘిక సాంస్కృతిక సత్యాలను మనం అధ్యయనం చేయవలసి ఉంటుంది. మనకు లభ్యమౌతున్న ఆధారాలను బట్టి ఈ పరిణామం అయిదు దశలలో జరిగిందని భావించవచ్చు.

ప్రథమదశ : దేవాలయ అంతర్భాగంలో కర్మకాండకు ఆలంబనంగా ఉండే కళావిధానం; కళా ప్రక్రియలు (Ritual forms)

రెండవ దశ : దేవాలయం బయట, ముఖ్యంగా గర్భగుడికి వెలుపల, దేవాలయ ఆవరణలో ఉపయోగించే ప్రక్రియలు (Temple forms)

మూడవ దశ : ఊరేగింపు ప్రక్రియలు (Procession forms) దేవాలయ ఆవరణ దాటి ఊరిలోకి ఉత్సవ విగ్రహాలను, ఇతర దేవతాగణాలను ఊరేగింపుగా తెచ్చినప్పుడు ఉపయోగించే కళారూపాలు.

నాల్గవ దశ : దేవాలయ కర్మకాండ ముగిసిన తరువాత, వచ్చిన భక్తులకోసం దేవాలయం ఎదుట, ఆరుబయట జరిగే భక్తి కథాగానం, భాగవతాలు (Social forms, mainly religious)

ఐదవ దశ : జాతర్లల్లో, కొలుపుల్లో ప్రజలకు వినోదం కూర్చడానికి నైతిక విలువలు ఉన్నా, మత సంబంధం లేని ప్రదర్శనలు. ఊరిమధ్య, నాలుగు బాటల కూడలిలో రంగస్థలం మీద ప్రదర్శింపబడేవి. భక్తికన్న వినోదం ప్రధానమైనవి. (Social forms, non-religious).

ఈ అయిదు దశల్లోను, మొదటి రెండుదశల్లోని కళారూపాలు పురాణ, భక్తి సంప్రదాయాలకు భిన్నంగా ఉంటాయి. పురాణ సంప్రదాయం సామాన్యప్రజలకు చేరువకావడానికి భక్తి సంప్రదాయంలో ఉన్న ప్రదర్శన విధానాలను వాడుకోవడం మూడవదశనుంచి ప్రారంభం అవుతున్నది. అక్కడినుంచి అయిదవ దశవరకు క్రమంగా వికసించిన కళారూపాలు భక్తి సంప్రదాయాన్ని అనుసరించి జానపద కళారూపాలయినాయి. పురాణ సంప్రదాయాన్ననుసరించి శాస్త్రీయ కళారూపాలయినాయి. శాస్త్రీయ కళారూపం ఏదయినా సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండడంతో జానపద కళారూపంగా ప్రారంభమై వైయక్తిక ప్రతిభా వ్యుత్పత్తులతో శాస్త్రసమ్మతమైన శాస్త్రీయ కళారూపంగా ఎదుగుతుంది. పురాణ సంప్రదాయాన్ని అనుసరించడమంటే కళాచరిత్రలో శాస్త్రపద్ధతుల్ని తు.చ. తప్పకుండా పాటించడమనే అర్థం.

ఈ పరిణామక్రమంలో క్రీస్తుకు పూర్వం 2వ శతాబ్దం నుంచి క్రీస్తు శకం 2వ శతాబ్దం వరకు ఉన్న కాలాన్ని సంధియుగంగా భావించవచ్చు. అప్పటికి పురాణ, భక్తి సంప్రదయాలు ఒకదానినుంచి మరొకటి ఇచ్చిపుచ్చుకోవడం జరిగిపోయింది. కళారూపాల్లో మాత్రం జానపద, శాస్త్రీయ కళారూపాలంటూ వేరువేరు పాదులుగా చీలకముందు, పురాణ, భక్తి సంప్రదయాలు జమిలిగా పెనవేసుకుని ఉన్న రోజుల్లో కళారూపాలను గురించిన స్థూలమైన విభజన మనకు అందుబాటులో ఉంది. క్రీస్తుశకం రెండవ శతాబ్దానికి చెందినవాడని నిర్ధారించబడ్డ పతంజలి తన 'మహాభాష్యం'లో ఆనాడు ప్రచలితంగా ఉన్న కళారూపాలు మూడు విధాలుగా ఉన్నాయని పేర్కొన్నాడు: అవి- శోభిక, చిత్రిక, గ్రంథిక - అన్నాడు.

మూడుపాయలుగా సాగుతున్న ఈ కళారూపాల ప్రత్యేకతలను గురించి కూడా చెప్పాడు పతంజలి. శోభిక మూకనృత్యమనీ, చిత్రిక బొమ్మలను చూపుతూ కథ నడిపించడమనీ, గ్రంథిక వ్యాఖ్యానాత్మకంగా చేసే ప్రసంగమనీ పేర్కొన్నాడాయన. దేవతల పండుగలలో, దేవాలయ ప్రాంగణంలో చేసే నృత్యం, పాడే భజన, కీర్తనల స్థాయినుంచి భాగవతాల వరకు పెరిగిన కళారూప పరిణామంలోని వివిధ స్థాన, గుణ విశేషాలు భూమికగా గ్రహించి చూస్తే

పతంజలి చేసిన ఈ విభజన ఎంత సమంజసమో తెలుస్తుంది. మొట్టమొదటగా - ఈ విభజనలో కళారూప ఆవిర్భావం మనకు అవగతమౌతున్నది. ముందుగా వాద్యసహకారంతో చేసే మూకనృత్యం; తరువాత పాట - ఆ పాటను కళారూపంగా మలచడానికి దోహదపడిన కథాకథనం; ఆతరువాత గ్రంథం ఆధారంగా ఆడే ఆటకు, పాడేపాటకు వ్యాఖ్యానాత్మక అభినయం. ఇదీ పతంజలి వింగడింపులోని ఆంతర్యం.

అయితే మనం పైన చెప్పుకొన్న స్థల పరిణామంలో (దేవాలయ గర్భగుడినుండి ఊరి మధ్య వేదిక వరకు) ఈ ప్రదర్శన కళలు ఏవిధంగా ప్రయోగించబడ్డాయో విశ్లేషించుకొంటే ఈనాడు ప్రాచుర్యంలో ఉన్న అన్ని జానపద కళారూపాల ఆవిర్భావం ఎలా జరిగిందో మనం గ్రహించవచ్చు. దీనివలన పురాణ, భక్తి సంప్రదాయాల సమన్వయం కళారూపాలలో ఏవిధంగా జరిగిందో కూడా గమనించవచ్చు.

ఈ పరిణామగతి దృష్టితో చూస్తే శోభిక మూకనృత్యమనీ, దేవాలయాల్లోను, దేవాలయ ప్రాంగణాల్లోను, ఊరేగింపుల్లోను దీని ప్రాముఖ్యం ఎక్కువనీ, మానవుడు తన సృజనాత్మక శక్తిని భగవదారాధన కోసం ఏవిధంగా ఉపయోగించిందీ స్పష్టం అవుతుంది. ఆ తరువాత ఉత్సవ విగ్రహాల నమూనాలతో, తన భావనాశక్తిని జోడించి బొమ్మలను సృష్టించి ఆ బొమ్మలు ఆధారంగా ఆయా దేవతా గాథలను చెప్పే విధానం వచ్చింది. ఇది చిత్రికదశ. ఈ చిత్రికలో రెండురకాలు మనదేశం అంతటా కానవస్తాయి. ఒకటి మట్టి, ఇత్తడిలతో తయారుచేసి, ఆ బొమ్మలకు ఒక వేదిక నిచ్చి, వాటి గతి విధానాన్ని మారుస్తూ, సన్నివేశానికి అనుగుణంగా వాటిని చేరుస్తూ చెప్పే కథ ఒకరకం. రెండోది ఇంకా ఎక్కువ కళాత్మకమైనది. గుడ్డమీద వరుసగా కథాక్రమాన్ని చిత్రించి, ఆ బొమ్మల ఆధారంగా కథ చెప్పడం. ఈ రెండు పద్ధతులూ ఈనాడు ఆంధ్రదేశంలో కానవస్తాయి. మొదటిది మందహెచ్చువారు, తగరజోగులు చెప్పే కథ. అన్ని పటకథలూ రెండోవర్గానికి చెందినవి. ఈ రెండోపద్ధతి ఆనాడు ఎంత ప్రజామోదం పొందిందో తెలుసుకోవాలంటే - దాదాపు అన్ని కుల పురాణాలు ఈ పటకథల ద్వారా చెప్పడమే జరిగేది అన్న సత్యాన్ని గమనించవలసి వుంటుంది.

శోభిక, చైత్రిక, గ్రంథిక - అన్న యీ మూడు ప్రక్రియలు ముందు విడివిడిగా ప్రదర్శించబడ్డా, రానురాను ఒకదానితో మరొకటి కలిసి ప్రదర్శించడం వలన జానపద కళారూపాలలో విస్తృతి, సంక్లిష్టత కూడా రూపుదిద్దుకున్నాయి. ఉదాహరణకు శోభిక ఆలయనృత్యంగా ప్రారంభమై ఊరేగింపులో గల మేాన్ని పెంచుకున్నది. చైత్రిక ముందుగా కేవలం ఊరేగింపుల్లో దేవతాగణాల బొమ్మల నమూనాలను చూపడంతో (బుట్టబొమ్మలు వగైరా) ప్రారంభమై, ఉత్సవ విశ్రామ సమయాల్లో బొమ్మలతో కథలు చెప్పే పద్ధతికి దారితీసింది. ఇందులో గానం, కథాకథనం రెండూ ముఖ్యమే. గానరహితమైన, నృత్యప్రధానమైన చైత్రిక కేవలం ఊరేగింపు ప్రక్రియ మాత్రమే! ఈ నృత్యం (శోభిక), బొమ్మలతోపాటు గానం (చైత్రిక) వీటికి వ్యాఖ్యానం (గ్రంథిక) తోడైంది. ఈ దశలో కథాకథనం, గానం, వ్యాఖ్యానం, అవసరమైనచోట్ల నాటకీయత జోడించబడ్డది. అప్పుడది కేవలం దేవాలయ, ఊరేగింపు ప్రక్రియల నుంచి విడివడి సామాజిక రూపం అయింది. దేవతల కథలకీ, దేవాలయ ప్రాంగణంలో కాక, దేవాలయానికి అభిముఖంగానో, లేదా వీధి కూడలిలోనో వేదికమీద ప్రదర్శించడం ఎప్పుడు ప్రారంభమైందో అప్పుడే జానపద నాటకానికి తొలిరూపం ఆవిర్భవించిందన్నమాట.

శోభిక, చైత్రిక, గ్రంథికలు మూడు వేరువేరు కాలంలో తమ తమ ప్రాచుర్యాన్ని సంతరించున్నా, అందులో ప్రతి ఒక్క ప్రక్రియ మిగిలిన రెండు ప్రక్రియలను తనలో ఇముడ్చుకొనడం ద్వారా కొన్ని వందల కళారూపాలను సృష్టించుకోవడం సంభవం అయింది. ఈ ప్రక్రియల పరస్పర సంయోజనం కళారూపాల పరిణామంలో అతి ముఖ్యమైన అంశంగా మనం గమనించవచ్చు. ఉదాహరణకి -

**శోభిక**

- **మొదటిదశ:**
  ముందుగా మూకనృత్యంగా ప్రారంభం - కర్మకాండలో భాగంగా.
  ఆలయ ప్రాంగణంలో
- **రెండవ దశ :**
  ఉధృత నృత్యం + చైత్రిక (విడివిడిగాను, బొమ్మలతోను కూడా)
  ఊరేగింపుల్లో
- **మూడవ దశ :**
  నృత్యం + చైత్రిక + గ్రంథిక
  ఊరేగింపుల్లో, వీధికూడలిలో, దేవాలయ ప్రాంగణం ఎదుట.

ఈ మూడింటికి వరుసగా - దేవాలయం దగ్గర ఆడే నృత్యాన్ని (ఆసాది), ఊరేగింపులో విడివిడిగాను, బొమ్మలతోను ఆడే నృత్యాన్ని (గరగలు, బుట్టబొమ్మలు), ఊరేగింపు జరిగేటప్పుడు ఒకచోట ఆగి ఆడుతే కొంతగ్రంథం కూడా చెప్పే నృత్యాన్ని (ఉరుములు, వీరనాట్యం) పేర్కొనవచ్చు.

రెండవది చైత్రిక. చిత్రాలకు లేదా బొమ్మలకు జానపద కళల్లో ప్రత్యేకమైన స్థానం ఉంది. దేవతామూర్తులకు చెక్కిన బొమ్మలు - కొయ్యవి, తోలువి, వెదురువి - ఏవైనా సరే - ఆధారంగా నృత్యం చెయ్యడం, కథలు చెప్పడం, జాతరల్లో కొలుపుల్లో సర్వసాధారణం. ఘటాన్ని నెత్తిమీద ఉంచుకొని నృత్యం చెయ్యడం దీనికి ప్రాథమిక రూపం. ఘటం, లేదా గరగ ఒక ప్రతీక. అలాగే బొల్లి ఆవును తలమీద పెట్టుకొని నృత్యం చెయ్యడం కూడా ఇటువంటిదే! ఆ తరువాత దేవతల రూపంలో, ఆయన లీలలకు చెప్పే కథలలో వచ్చే పాత్రల రూపంలో బొమ్మలను తయారుచేసి కథ చెప్పడం కూడా ఈ తరగతికి చెందిన రెండవదశ. ఒక్కొక్కప్పుడు ఎవరి కథ చెబుతున్నారో ఆ వేషాన్ని ధరించి కథచెప్పడం కూడా ఈ తరగతికి చెందినది (ఎల్లమ్మకథలో కథకుడు ఎల్లమ్మ వేషాన్ని ధరించడం; వీర విద్యావంతులు పట్నాటికథ చెప్పేటప్పుడు వేసే వేషం వంటివి ఇందుకు ఉదాహరణలు.) ఆ తరువాత దశ బొమ్మలను ఆడిస్తూ కథ చెప్పడం. (మందహెచ్చు, తోలుబొమ్మలాట). చివరగా బొమ్మల స్థానంలో మనుషులు వేషాలలో ఆడుతూ కథ చెప్పడం (వీధి భాగవతం).

**చైత్రిక**

**మొదటి దశ :**
ఉత్సవ విగ్రహాల ఊరేగింపు : దానిని అనుసరించే నృత్యం
దేవాలయ ప్రాంగణంలో
గరగలు, లేదా ఘటంలో నృత్యం (చైత్రిక + శోభిక)
ఊరేగింపుల్లో

**రెండవ దశ :**
బొమ్మలు లేకుండా, దేవతామూర్తుల వేషంలో కథ చెప్పడం
(చైత్రిక + గ్రంథిక ± శోభిక)
దేవాలయం వెలుపల; వీధి కూడలిలో

**మూడవ దశ :**
బొమ్మలకు బదులు మనుష్యులు వేషాలు ధరించి కథ నడపడం
వీధి కూడలిలో; దేవాలయం వెలుపల (వీధిభాగవతం)

ఇక మూడవది గ్రంథిక. మిగిలిన రెండు ప్రక్రియలతో అనుబంధం పెంచుకొని ప్రథమదశలో ఇది భజన, కీర్తనలతో ప్రారంభం అయి పురాణ ప్రవచనంతో మొగ్గలు తొడిగి, కథా కాలక్షేపం లేదా హరికథతో పూలు పూచింది. మిగిలిన రెండు ప్రక్రియలకు మూలం జానపద జీవనరీతుల్లో కనిపిస్తే, గ్రంథికకు మాత్రంపురాణ సంప్రదాయమే మూలమని కనిపిస్తుంది. కాని త్వరలోనే మిగిలిన రెండు ప్రక్రియలతో చేరి జానపదుల రీతిలో, జానపదుల బాణీలో జానపద కళారూపాల నెన్నింటికో మాతృక అయింది.

**గ్రంథిక**

**మొదటి దశ :**
చైత్రిక లేదా శోభిక లేని ఒట్టి పాట లేదా వ్యాఖ్యానం
(పురాణం, భజన, కీర్తన) దేవాలయం గర్భగుడిలో.

**రెండవ దశ :**
చైత్రికల సాయంతో కథాకథనం (గ్రంథిక + చైత్రిక)
తగరజోగులు, మందహెచ్చు,

**మూడవ దశ :**
చైత్రికలు లేకుండా వ్యాఖ్యానాత్మక కథాకథనం
అన్ని జానపద గేయగాథలు (గ్రంథిక + చైత్రిక + శోభిక)

**నాల్గవ దశ :**
చైత్రికలకు బదులు మనుషులు వేషాలు ధరించే కళారూపాలు
అన్ని జానపద నాటకాలు (గ్రంథిక + చైత్రిక + శోభిక)

మూకనృత్యంతో ప్రారంభమైన జానపదుల సృజనాత్మక వ్యక్తీకరణం ఆట - పాట- మాటలతో వ్యాఖ్యానాత్మకం అయి, కథాకథనాన్ని తనలో ఇముడ్చుకొని, సంభాషణలను చేర్చుకొని సంపూర్ణ నాటకరూపాలయినాయని విదితం అవుతున్నది. ఆట - ఆటవికులనుంచి జానపదులకు సంక్రమించి భాండారం. వాద్యమూ అంతే. భక్తి సంప్రదాయం నుంచి ఆట, పురాణ సంప్రదాయానికి చెందిన భజన, కీర్తన ఎప్పుడు ఏకోన్ముఖంగా పూజారూపాలుగాను, ఆ తరువాత కళారూపాలుగాను రూపొందాయో చెప్పడం కష్టమే కాని ఎందుకు ఉపయోగించబడ్డాయో మాత్రం చెప్పవచ్చు. కొలుపుల్లో సాగే వాద్యం, ఆట బాహిర (outside) కళారూపాలు - భజన, కీర్తన ఆంతర (inside) రూపాలు. పురాణ సంప్రదాయం జనామోదం పొందడానికి, ఊరేగింపుల్లో బాహిరకళా రూపాలను వాడుకోవలసిన అవసరాన్ని బట్టి భక్తి సంప్రదాయం నుంచి వానిని స్వీకరించింది.

ఈవిధంగా పరిణామక్రమంలోని ఒక దశలో భక్తి, పురాణ సంప్రదయాలలో ఉపయోగించిన నృత్య, గాన, వ్యాఖ్యాన ప్రక్రియలలో విడివిడిగాను, కలిసిపోయిగాని ఎన్నివందల విధాల జానపదుల భావనాశక్తికి పదునుపెట్టి, వారి సృజనాత్మకశక్తికి గీటురాయిగా నిలుస్తున్నాయో!

## వివిధ ప్రక్రియల స్వరూపం :

ఇదివరకే చెప్పుకున్నట్లు ఈ కళారూపాల పరిణామం, ఒక ప్రక్రియ మరోప్రక్రియను చేర్చుకొని, ఆ అనుసంధానంతో కొత్త కళారూపాలు పుట్టుకురావడం ఐదు దశల్లో జరిగింది. అవి దేవాలయ ప్రాంగణంలో ప్రారంభం అయి, వీధికూడలి వరకు సాగాయి. ఈవిధంగా స్థలం మార్పువల్ల ఏర్పడిన వివిధ కళారూపాలు స్వభావ స్వరూపాలను ఈక్రిందివిధంగా క్రోడీకరించవచ్చు.

**I & II దేవాలయ అంతర్భాగంలో ప్రారంభమై, ప్రాంగణం లోపలికి విస్తృతం చేయబడిన కళారూపాలు (Ritual and Temple Forms) :**

1. వీనిలో వాద్యానికి అనువుగా వేసే చిందు ముఖ్యం. మొదట మొదట ఉత్సాహంతో వేసే కేకలు తప్ప మరేవిధమైన పాట, మాటల ప్రసక్తి లేదు.
2. భగవత్ కైంకర్యం కోసం చేసే చిందు కనుక వాద్యానికి అనువుగా వేసే పద, అంగ విన్యాలకు ప్రాముఖ్యం.
3. విలంబితంలోనే గత విన్యాసాలు.
4. దేవాలయ ప్రాంగణంలోకి తెచ్చిన ఉత్సవ విగ్రహాలే మొదటి చైత్రికలు.
5. తరువాత తరువాత ఉత్సవ విగ్రహాలను ఊరేగించేటప్పుడు ఖడ్గాలు చదవడం, శరభలు మొదలయ్యాయి. ఇవే మొదటి గ్రంధిక.
6. దేవాలయంలోను, ప్రాంగణంలోను జరిగే కర్మకాండకు అనుసంధానంగా సాగే నృత్య విన్యాసమే కాని, అవి స్వయం స్వతంత్రాలు కావు.

7. ఇక్కడ పూజారికి, ఆయన చేసే కర్మకాండకు మాత్రమే ప్రాముఖ్యం. మిగిలినవన్నీ అనుషంగికాలు.

8. ఇక్కడ నమ్మకం ముఖ్యం. భక్తులందరూ ఉత్సవ విన్యాసంలో భాగస్వాములే.

9. ఇవి కర్మకాండకూ, కళాప్రదర్శనలకు మధ్యస్థరూపాలు.

**III. దేవాలయ ప్రాంగణంలోని కర్మకాండనుంచి పూర్తిగా విడివడకుండానే కొలుపుల్లో, జాతరల్లో జరిగే ఊరేగింపుతో సాగే కళారూపాలు (Procession forms), వాటి లక్షణాలు :**

1. ఈ దశలో శోభిక ఇంకా ముఖ్యమైన ప్రక్రియే అయినా, చైత్రిక దానికి అనుసంధానించబడ్డది. ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో, ఆ విగ్రహాలతోపాటు అయా దేవుళ్లకు, దేవతలకు సంబంధించిన ఎన్నో ఇతర విగ్రహాలు చేరాయి. ఇవి అన్నీ జానపదుల భావనాబలనాకి ప్రతీకలు.

2. ముందు నృత్యం. ఆ తరువాత బొమ్మలను ధరించి నృత్యం. వేరువేరుగా వున్నా, రానురాను అవసరం కొద్దీ, భక్తులను అప్రమత్తులను చేయడంకోసం, ఉత్తేజం కలిగించడంకోసం అప్పుడప్పుడూ గ్రంథిక కూడా చేర్చబడ్డది.

3. వాడి, వేడి ఉండే నృత్యరూపాలు రూపొందాయి. ఊరేగింపుకు అనుగుణంగా వడివడిగా చేసే నృత్యాలు ముఖ్యం. అలానే వీధి మొగదలనో, కామందుల ఇంటిముందో ఆగినప్పుడు వలయాకార నృత్యాలు, అందులో అనేక విశేషాలు వచ్చి చేరాయి.

4. ఉత్సవ విగ్రహాలకు తోడు, ఇతర విగ్రహాలు, బొమ్మలు వెలిశాయి. ప్రభలు, అందంగా అలంకరించిన బుట్టబొమ్మలు, ఎడ్లు, గుర్రాలు - వాటి ఆధారంగా చేసే నృత్యాలు - ఈవిధంగా దృశ్యచైత్రికలు రూపొందాయి. అన్నీ ఊరేగింపులో భాగస్వాములే.

5. గ్రామదేవతల జాతరలలో నృత్యం, కర్మకాండ - ఈ రెండు విడదీయని బంధంతో పెనవేసుకొనిపోయి వుంటాయి. వాటికి ప్రతీకలు ఈ శోభిక, చైత్రిక. ఊరేగింపుల్లో నృత్యం కర్మకాండనుంచి పూర్తిగా వేరయినట్లు కనిపించినా, అలా చెప్పడానికి వీలులేదు. ఊరేగింపులో కర్మకాండలో భాగాలయిన పూనకాలు, మూర్ఛలు, సేదతీర్చడాలు, వారుపోయడం, మొక్కులు తీర్చడం వంటివి అంతర్భాగాలే. ఇవి జరుగుతున్నా నృత్యం కొనసాగుతూనే ఉంటుంది. అయితే మామూలు ఊరేగింపుకు, కర్మకాండకు నృత్యకారుల నృత్యవిన్యాసంలో మాత్రం ఎంతో తేడా కనిపిస్తుంది. ఊరేగింపు నృత్యాల్లో వడి ఎక్కువ. కర్మకాడం నృత్యాల్లో ఉధృతి ఎక్కువ.

7. ఊరేగింపులో నృత్యం చేసే సిద్ధహస్తులైన కళాకారులు కొందరే అయినా, జనం అందరూ మూక ఉమ్మడిగా పాల్గొనే విధంగా శోభిక, చైత్రికలు విస్తృతం అయ్యాయి. తరువాత చాలాకాలానికి ఈ శోభికలకు గ్రంథాన్ని చేర్చి మూక నృత్యాలకు బదులు లయ ప్రధానమైన పాటలకు అనువుగా నృత్యం చేయడం ప్రారంభమైంది. కోలాటం, చెక్కభజన వంటివి ఇటువంటి సమ్మిశ్రిత రూపాలు.

ఈవిధంగా వచ్చిన సమ్మిశ్రిత రూపాలు అటు ఊరేగింపులో కర్మకాండకు మాత్రమే పరిమితం

కాక, వారి జీవన విధానంలో భాగమై ప్రతి దేవాలయంలోను సాయంకాలాలు ఆడి, పాడే సామాజిక నృత్యాలయినాయి.

**IV & V.** ఊరేగింపు దశనుంచి ఈ కళారూపాలు సామాజిక దశకు ఎదగడానికి చాలాకాలం పట్టి ఉండాలి. ఈ రెండు దశలకు మధ్య ఇతిహాస పురాణాల గానం వానికి వారధిగా నిలిచి ఉండాలి. ఇంతకాలం భగవద్భక్తి వ్యక్తీకరణే ధ్యేయంగా తమకు తోచిన విధంగా సామూహిక నృత్యాలలో పాల్గొన్న జానపదులు, రానురాను, అవసరాలను బట్టి వైయుక్తిక ప్రతిభను కనబరచడం ప్రారంభించారు. వారిని జానపదులు ఆదరించారు. ఆయా కులాల, మతాల సమీకరణకు ఆనాడు ఆటువంటి సమర్థులయిన వృత్తి కళాకారులు అవసరం కావడంతో ప్రతికులంలోను ఒక ప్రత్యేక విభాగంవారు కుల పురాణాలు చెప్పి, పూర్వులను స్మరించడానికి గాను నియోగించబడ్డారు. రానురాను వారు కులగాథలతోపాటు వీరుల గాథలను, పేరంటాళ్ళ గాథలను కూడా చెప్పడంతో ఆ కళారూపాలు సామాజిక కళారూపాలయినాయి.

ఇలా సామాజిక దశకు చేరుకున్న కళారూపాల లక్షణాలను ఈక్రిందివిధంగా వింగడించవచ్చు.

1. ఈ దశలో శోభిక, చైత్రిక, గ్రంథికలు మూడూ విడివిడిగాను, ఒకదానిని మరొకదానితో జోడించి ప్రయోగించడం జరిగింది.

2. ఈ మూడింటికీ పరస్పర సంబంధాలు పెంపొంది, ఒక కళారూపానికి మిగిలిన వానిని సంయోజనం చేయడంతో అనేక సంక్లిష్ట కళారూపాలు **(complex art forms)** బయలుదేరాయి.

3. ఇంతరవకు శోభిక, చైత్రికలకు మాత్రమే ప్రాముఖ్య ఉన్న కళారూపాలతో గ్రంథిక చేరడం వల్ల, వీనిలోపాఠ్యానికి **(text)**, అభినయానికి ప్రాముఖ్యం పెరిగింది.

4. రానురాను గ్రంథిక ఆధిక్యత పెరిగి, మిగిలిన ప్రక్రియలను తనలో ఇముడ్చుకొన్నది. అప్పుడు బొమ్మలకు బదులు మానవులే వేషధారణ చేసి కధాకధనం చేయడం, అవసరం మేరకు నృత్యాన్ని వాడుకోవడం మొదలైంది. ఈ పరిణామాన్ని రెండు అంచెలుగా చూడవచ్చు.

ఎ. మొదటి దశలో

i) గ్రంథిక (ప్రధానం) + శోభిక (అనుషంగికం)
----> కథాగాన రూపాలు.

ii) గ్రంథిక (ప్రదానం) + చైత్రిక (అనుషంగికం)
----> బొమ్మలను చూపుతూ కథ చెప్పేవి. (పట కథలు).

బి. రెండవ దశలో -

i) గ్రంథిక (ప్రధానం) + శోభిక (అనుషంగికం) + చైత్రిక (ఉంటే ఉండవచ్చు)
-----> నాటక రూపాలు
(చైత్రిక కూడా ఉంటే బొమ్మలాట వంటివి)

ii) గ్రంథిక (ప్రధానం) + చైత్రిక (ఆనుషంగికం) ± శోభిక
----> నృత్యం ప్రధానం కాని కథాకథన
అభినయ రూపాలు (నాటకం, పగటి వేషాలు వంటివి)

5. మొదటిదశలలో ప్రధానమైన వాద్యం, గ్రంథిక ప్రాముఖ్యానికి రావడంతో, పక్కవాద్యం అయిపోయింది.

6. సామాజిక కళగా రూపొంది, కర్మకాండ నుంచి విడిపోవడంతో, ప్రేక్షకులను ఆనందింప చేయడం ప్రధాన లక్ష్యం అయింది.

7. ఎవరి కళాప్రదర్శన బాగుంటే వారిని ప్రజలు ఆదరిస్తారు కనుక కళమీద ప్రత్యయం పెరిగి, కళాకారుల ప్రతిభ గుర్తింపుకు వచ్చింది.

8. ఈదశలో అన్నీ స్థావర ప్రదర్శనలయ్యాయి. వీధి కూడలిలో ప్రదర్శనలు ఇవ్వడం మొదలైంది.

9. ప్రదర్శకుల ప్రాముఖ్యం పెరిగింది. ఆయా కళాకారుల ప్రతిభమీద ఆధారపడి గ్రంథం విస్తృతం కాసాగింది.

10. ఎప్పుడయితే సామూహిక ప్రదర్శనలనుంచి వైయక్తిక ప్రతిభాప్రకటనకు ఆస్కారం దొరికిందో, అప్పుడు వృత్తికళాకారులు, వృత్తి సమాజాలు వెలిశాయి.

ఇంతరవకు కళారూపాల పరిణామంలో ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి మారితే ఆయా కళారూపాలలో వచ్చే మార్పు వివరించ బడ్డది. ఒక కళారూపం కేవలం భక్తి పారవశ్యాన్ని వెల్లడించడానికే ఉద్దేశించబడ్డదా? అది కొలుపుల్లో ఆత్మసాదృశ్యం కోసం చేసే విశ్వాసప్రకటనా? ఈ ఆత్మావిష్కారం ఎందుకు జరుగుతున్నది? అన్న ప్రశ్నలను బట్టి ఆయా కళారూపాల మౌలిక లక్షణాలను వివేచించడం జరిగింది. ఉదాహరణకు -

| | | |
|---|---|---|
| దేవాలయ ప్రాంగణంలో ఉపయోగించే కళారూపాలు | -----> | భక్త ప్రధానం, గతి వేగం తక్కువ.<br>తారస్థాయిలో ఉండని విన్యాసం |
| ఊరేగింపులో | -----> | ఆవేశం ప్రధానం<br>గతి వేగం ఎక్కువ.<br>తారస్థాయిలో ఆట, పాట. |
| స్థావరంగా, ఊరిమధ్య | -----> | ఆవేశం కన్నా, ఆనందం ముఖ్యం.<br>గతివేగం కథాగమనాన్ని బట్టి మారుతూ ఉంటుంది.<br>ఆట, పాట కథకు అనువుగా ఉంటాయి. |

అలానే కళాకారులకు ప్రేక్షకులకు మధ్య సంబంధం కూడా ఆయా కళారూపాలు ప్రదర్శించే ప్రదేశం నిర్ధారిస్తుంది. ఉదాహరణకు, అమ్మవాడి గుడిలో అందరూ భక్తులే. ఊరేగింపులో చాలామంది భక్తులు.

ప్రేక్షకులు ఉన్నా, వారికి కళాకారులకు ఒక అనుబంధం ఉంది. అందరూ భక్తిభావంతో తాదాత్మ్యం చెందుతూ ఒకే అనుభవాన్ని పంచుకొనే వారే (shared experience). ఇక ఊరిమధ్య ప్రదర్శించే కళారూపాలలో ఏ కొద్ది మందో ప్రదర్శకులు; ఎక్కువమంది ప్రేక్షకులు. ప్రేక్షకుల కోసం, వారి ఆనందం కోసం ప్రదర్శించడం ప్రదర్శకుల విధి అయింది.

స్థల పరిణామం (spacial change) కళారూపాలలో అవసరాలకు అనుగుణమైన అనేకమైన మార్పులను తీసుకొని రావడం గమనించాం. ఈ స్థల పరిణామానికి ఆయా కళారూపాలలో వచ్చే గుణ పరిణామానికి (qualitative change) దగ్గర సంబంధం ఉంది. ఈ గుణ పరిణామం ముఖ్యంగా ఒక ప్రత్యేకమైన ప్రక్రియ ఇతర ప్రక్రియలను తనలో ఇముడ్చుకున్నప్పుడు జరుగుతుంది. అప్పుడు సామాన్య ప్రక్రియలు (simple forms) సంక్లిష్ట (complex) ప్రక్రియలుగా రూపొందుతాయి.

జానపద కళారూపాలలో ఈ మార్పు రావడం సహజం. ఏ మార్పు వచ్చినా (అది స్థలం మార్పు అయినా, ప్రేక్షకుల మార్పు అయినా) అందుకు అనుగుణంగా తమ కళారూపాలను మలుచుకోవడంలో జానపదులు కృతకృత్యులైనంతగా నగరవాసులు కాలేరు. జానపద కళారూపాల పరిణామ విధానం అదే విషయాన్ని మనకు సుస్పష్టం చేస్తున్నది.

*('జానపద వ్యాసావళి' నుంచి)*